క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు చేయూత

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్


నగదు అందజేస్తున్న టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: రైతు ఆత్మహత్య కుటుంబాలకు కిసాన్‌బంధు సంస్థ చేయూతనిస్తోందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం రాధిక కుటుంబానికి రూ.15,600నగదు, కుట్టుమిషన్ అందించారు. రైతు కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడరాదన్నారు. కార్యక్రమంలో టీజేఏసీ గౌరారం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతు హల్‌చల్


కౌంటర్ వద్ద అడ్డంగా పడుకున్న వ్యక్తి

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్‌లో ఓ తాగుబోతు హల్‌చల్ చేశాడు. బుధవారం మధ్యాహ్నం 1గంటల సమయంలో ఖాతాదారులతో రద్దీగా ఉన్న సమయంలో మద్యం మత్తులో ఆఫీసు కౌంటర్ వద్దకు వచ్చి గట్టిగా అరుస్తూ సిబ్బందిని, ఖాతాదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. కౌంటర్‌పై ఉన్న కాగితాలను, ఇతర వస్తువులను విసిరేశాడు. దీంతో పోస్టాఫీసుకు వచ్చిన మహిళలు బయపడి పరుగులు తీశారు. కొద్ది సేపటికి కార్యాలయంలోకి ఎవరు వెళ్లకుండా అడ్డంగా పడుకున్నాడు. దీంతో కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి అతడిని పీఎస్‌కు తరలించారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశం

కొడంగల్ రూరల్ : ఈ నెల 22న పరిగిలో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు బి.నర్సిములు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాలలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు సభ్యులు కృష్ణంరాజు, పవన్‌కుమార్, నరేష్, వెంకటయ్య, నర్సిములు, వెంకటయ్య, కాంతు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సుందర్‌రాజ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తాండూరు జెడ్పీటీసీగా పని చేశాడు. గత కొంతకాలంగా సుందర్‌రాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుందర్‌రాజ్ మృతిపట్ల మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

స్థానికులకు టికెట్ ఇవ్వాలి


టికెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్న వసంత్

అనంతగిరి: సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ తరఫున వికారాబాద్ ఎమ్మెల్యే టికెట్‌ను స్థానిక అభ్యర్థులకు కేటాయించాలని వైఎస్సార్‌టీపీ సీనియర్ నాయకులు కావలి వసంత్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను వికారాబాద్‌లో స్థానికంగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నానని తెలిపారు. స్థానిక సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. పార్టీ తనకు అవకాశం ఇస్తే తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మర్పల్లి: బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటా ప్రచారం చేస్తున్నామని బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మధుకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో ఆ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదగిరితో పాటు కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. డాక్టర్ మెతుకు ఆనంద్ తిరిగి విజయం సాధిస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఉన్నారు.

అన్నపూర్ణ దేవీగా అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవీ రూపంలో దర్శనమిచ్చారు. పూజారులు ఉదయం నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు చేస్తున్నారు. ఆలయంలో విశేష పూజలు, కుంకుమార్చనలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. అనంతరం పూజారులు భక్తులకు అమ్మవారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు.


బషీరాబాద్: కూష్మాండ రూపంలో


ధారూరు: లక్ష్మీదేవి అలంకరణలో


తాండూరు టౌన్: అన్నపూర్ణాదేవీగా అమ్మవారు


పెద్దేముల్: శాకాంబరి దేవీగా తుల్జామాత


పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ కిరణ్ దంపతులు


తండూరుటౌన్: బతుకమ్మ వేడుకల్లో నాయకులు

గ్యారంటీలతో అధికారం ఖాయం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్


కొండగల్ రూరల్: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

మర్పల్లి: ఆరు గ్యారంటీ స్కీంలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంసీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్‌తో పేదలకు జరిగిన మేలు ఏమి లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో పేద ప్రజలు అన్నివిధాల లబ్ధిపొందారని గుర్తు చేశారు. వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ ఓ రియల్ ఎస్టేట్ మాఫియా అని మండిపడ్డారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ గెలుపును ఎవ్వరు ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రఫీ, సురేష్, ఉపాధ్యక్షుడు సలీం, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫసి, పంచలింగాల, నర్సాపూర్, రావులపల్లి సర్పంచ్‌లు సురేందర్‌రెడ్డి, ధరమ్‌సింగ్, అబ్రహం, మార్కెట్ డైరెక్టర్ అనంత్ రెడ్డి తదితరులు ఉన్నారు

పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

యాలాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని మండల మాజీ అధ్యక్షుడు భీమప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు తప్పక అమలు చేస్తామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని గ్యారంటీ పథకాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. అధికార పార్టీ గ్యారంటీ పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం యాలాల గ్రామ కొత్త కమిటీని ఎన్నిక చేశారు. కార్యక్రమంలో కమాల్‌పూర్ సర్పంచ్ బస్వరాజ్, నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి హాజీపూర్ ప్రశాంత్, మల్లప్ప, కాంగ్రెస్ నాయకులు నాగయ్య, మైనోద్దీన్, ఖాసీం, చందు, జిలానీ, మన్సూర్, సమద్ తదితరులు ఉన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, గుముడాల, నందారం, సంగాయిపల్లి, కుదురుమళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీ పథకాలపై బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, అశోక్, తిమ్మారెడ్డి, మోహన్‌నాయక్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం

బొంరాస్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి 'ఆరు గ్యారంటీ కార్డులు' అమలు చేస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం దుద్యాల మండలాల్లోని గౌరారం తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమం తప్పక సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీసీ వెంకటయ్య, ఎన్ఎస్‌యూఐ నేతలు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే

కుల్కచర్ల: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నియంతృత్వ విధానంతో వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, అంజి, కృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కొడంగల్ రూరల్ : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పలువురు ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని అంగడిరాయిచూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నాగప్ప, రాము లు, చిన్న, శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టించుకోరా?

- సర్పంచులు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వరా..
- సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

నవాబుపేట: వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు గ్రామాల్లోకి రారు.. రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భవాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖపై చర్చిస్తుండగా సభ్యులు మీరు గ్రామాల్లోకి వస్తున్నారా.. పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారా....అని నిలదీశారు. దీంతో ఏఓ ప్రసన్నలక్ష్మి సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వేదికలు ఉన్న ఒక్కసారి కూడా అందులో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. రుణాలు రెన్యూవల్ చేసుకున్న రైతులకు రుణ మాఫీ కావడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గొర్రెలు పంపిణీ చేసిన రెండు రోజులకే లబ్ధిదారులు అమ్ముకుంటున్నారని , అలాంటప్పుడు అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే, కొత్త రేషన్ కార్డులకు అవకాశం లేదు, మార్పు చేర్పులకు అవకాశం ఉందని తహసీల్దార్ జయరాం తెలిపారు. ఓటరు లిస్టులో మార్పు చేర్పులకు ఇంకా సమయం ఉందన్నారు. వయస్సు పైబడిన అంగన్‌వాడీలను తొలగించి కొత్త వారిని నియమించాలని సభ్యులు సభదృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు , రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఎంపీడీఓ సుమిత్రమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు రఫీ, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, పర్మయ్య, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ వేడుకలను బుధవారం పలు కళాశాలు, ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఒకచోట చేర్చి ఆటపాటలతో సందడి చేశారు. గ్రామాల్లోని మహిళలు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.


పెద్దేముల్: బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు


అనంతగిరి: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకరనాయక్


అనంతగిరి: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని శాంతినగర్‌లో బతుకమ్మతో మహిళలు

సావిత్రమ్మకు ఉత్తమ సర్పంచ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సావిత్రమ్మ

కొడంగల్ రూరల్ : మండలంలోని చిన్ననందిగామ సర్పంచ్ సావిత్రమ్మ జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. బుధవారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ జాతీయస్థాయిలో అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. 10ఏళ్లుగా గ్రామ ప్రజల చైతన్యానికి కృషి చేసినందుకు రాజ్యాధికార పితామహుడు మాన్యవర్ కాన్షీరాం చెల్లెలు స్వర్ణకౌర్, ఢిల్లీ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు రాజ్‌కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ మల్లేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చేతుల మీదుగా జాతీయ పురస్కరం అందుకున్నట్లు సర్పంచ్ సావిత్రమ్మ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సభలకు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- తాండూరు రూరల్ సీఐ రాంబాబు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

బషీరాబాద్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు రూరల్ సీఐ రాంబాబు అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీరాబాద్‌లో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు, ప్రచార వాహనాలకు అనుమతులను 'సువిధ' లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్లు, సామాన్యులు అధికారులకు ఏదైన ఫిర్యాదు చేయాలనుకుంటే సీ విజిల్ యాప్‌లో చేయాలని అన్నారు. ప్రయాణికులు వాహనాల్లో రూ.50 వేలకు మించి డబ్బులు, బంగారం తీసుకెళ్లోద్దని సూచించారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరిపిన, ప్రలోభాలు పెట్టిన అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టులు పెట్టి నిరంతరం తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీడీఓ రమేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

పూడూరు: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పరిగి సీఐ వెంకటరామయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేస్తామని చెప్పారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వస్తువులకు సంబంధించి రసీదులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం, నగదు, ఇతర వస్తువులను తరలిస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చన్గోముల్ ఎస్ఐ గిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా టీడీపీ

- ఆ పార్టీ జాతీయ కార్యదర్శి వీరేశ్ ముదిరాజ్


టీడీపీలో చేరిన ఆయా పార్టీలో నేతలు

కుల్కచర్ల: మండలంలోని అంతారం, రాంపూర్, కొత్తపల్లి, కామునిపల్లి గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. పరిగి నియోజకవర్గంలో బీసీల జెండా ఎగురవేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలముకుందం, మాణిక్యం, ముకుంద నాగేశ్వర్, బాబయ్య, శ్రీశైలం, చౌడాపూర్ మండల టీడీపీ అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, లక్ష్మయ్య, తిరుపతయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా టీడీపీ

దోమ : బడుగు బలహీన వర్గాలకు టీడీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి వీరేష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దాదాపూర్‌లో ఆయా పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు సుమారు 200 మంది టీడీపీలో చేరారు. ఈ మేరకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బలహీన వర్గాల పార్టీ అని ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకు మంచి ఆదరణ లభిస్తుందని, ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించేలా ముందుకు సాగాలన్నారు. పరిగి ప్రాంత అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగాలు వచ్చేలా తాను ముందుండి పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ భాస్కర్, టీడీపీ నేతలు శివశంకర్, మల్లేశ్, కృష్ణ, వెంకటేశ్, పాల్గొన్నారు.

జోరుగా దసరా వ్యాపారం

వికారాబాద్ అర్బన్: పట్టణంలో దసరా సీజన్ ఊపందుకుంది. ప్రధానంగా వస్త్ర దుకాణాలు జనాలతో కళకళలాడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ ప్రజలతో రద్దీగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వికారాబాద్‌లో చందన బ్రదర్స్, జాకీ, కసమ్, వైట్‌హౌస్, సియారామ్ వంటి షాపింగ్ మాల్స్ ఏర్పడటంతో వాటిలో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. తాండూరు, పరిగి, కొడంగల్ వంటి పట్టణాల నుంచి కూడా ఇక్కడికి షాపింగ్‌కు వస్తుండటంతో పట్టణంలో దసరా వ్యాపారం జోరుగా సాగుతోంది.



వస్త్ర దుకాణంలో రద్దీగా ఉన్న వినియోగదారులు

నేతలను అడ్డుకుంటే కేసులే

- సమన్వయ సమావేశంలో ఎస్ఐ వ్యాఖ్యలు
- ఎన్నికల నిబంధనలను వివరించిన తహసీల్దార్, సీఐ


సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ధారూరు: ఎన్నికల ప్రచారానికి వచ్చే నేతలను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని ధారూరు ఎస్ఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ధారూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలానికి చెందిన అన్ని పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఒకవేళ ఎన్నికల కేసులు నమోదు అయితే మీరు చచ్చేంతవరకు మిమ్మల్ని వెంటాడుతాయన్నారు. ప్రచారానికి వస్తున్న వారిని ప్రశ్నిస్తే తప్పెలా అవుతుందని పలువురు ఎస్ఐను ప్రశ్నించారు. దారికి అడ్డంగా ట్రాక్టర్లు పెట్టడం, రాళ్లు పెట్టడం తప్పు కాదా అని ఎస్ఐ ప్రశ్నించగా అలాంటివి తప్పేనన్నారు. ఎన్నికల్లో నిలబడ్డ నాయకుడికి నచ్చితే ఓటెయ్యండి, లేకుంటే వేయకండి, కాని అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పోలీసుల ముందే బాహాబాహీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గట్టెపల్లికి రావడంతో గొడవ జరిగిన విషయం తెలిసిందే. బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశం అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంపై చర్చ లేవదీశారు. ఓ బీఆర్ఎస్ నాయకుడు కాంగ్రెస్ నాయకులపై దురుసుగా మాట్లాడంపై గొడవ చెలరేగింది. పోలీసుల ముందే మీరెంత అంటే మీరెంత అన్న స్థాయికి చేరింది. ఎస్ఐ పదేపదే సూచించిన శాంతించలేదు. చివరకు రెండు వైపుల నుంచి నలుగురు చొప్పున తన చాంబర్‌లోకి పిలిపించుకుని గొడవను శాంతింపజేశారు.

నిబంధనలు వివరించిన తహసీల్దార్, సీఐ రామకృష్ణ

సమన్వయ సమావేశంలో తహసీల్దార్ భువనేశ్వర్, సీఐ రామకృష్ణలు మాట్లాడుతూ.. సువిధ, సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఎన్నికల నిబంధనలు, ఉల్లంఘనలు, ర్యాలీలు, మీటింగ్‌లకు అనుమతులు తీసుకునే విధానంపై వివరించారు. నిబంధనల ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు రాములు, మహ్మద్ బాబాకాన్, రాజునాయక్, విజయభాస్కర్‌రెడ్డి, అంజయ్య, సుధాకర్‌గౌడ్, మోయిజ్‌ఖురేషి, బసప్ప, బసవరాజు, విజయకుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను సముదాయిస్తున్న ఎస్ఐ